సాక్షి
చిత్తూరు
గురువారం । 14 । సెప్టెంబర్‌ । 2023



సామాన్యులకు సంతృప్తికర దర్శనం

కాణిపాకం బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని జిల్లా కలెక్టర్‌ షణ్మోహన్‌ సూచించారు. - 8లో



బోయకొండ కానుకల లెక్కింపు

బోయకొండ గంగమ్మ ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.65.15 లక్షల ఆదాయం వచ్చింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	25
తిరుపతి	36	24
తిరుమల	31	21
గూడూరు	38	28
నగరి	37	26

న్యూస్‌రీల్‌

జాతీయ ఈత పోటీలకు ఎంపిక


చంద్రబాబు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్‌ వైఎస్సార్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఏ.చంద్రబాబు జాతీయ స్థాయి ఈత పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్‌ అన్నపూర్ణశారద బుధవారం తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన అంతర్‌ జిల్లాల ఉద్యోగులు క్రీడల్లో పాల్గొని 200 మీటర్ల ఈత పోటీల్లో ప్రథమ స్థానం సాధించారని చెప్పారు. తద్వారా జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం చంద్రబాబును అభినందించారు.

17న బాల్‌ బ్యాడ్మింటన్‌ జిల్లా జట్టు ఎంపిక

నగరి : ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్‌ బ్యాడ్మింటన్‌ జట్టును ఈనెల 17వ తేదీ ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్‌ కార్యదర్శి పి.బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయం మైదానంలో సబ్‌ జూనియర్స్‌, జూనియర్స్‌ ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీలకు విచ్చేసే సబ్‌ జూనియర్‌ క్రీడాకారులు 2008,జనవరి 2వ తేదీ లోపు, జూనియర్‌ క్రీడాకారులు 2004, జనవరి 2వ తేదీ లోపు జన్మించి ఉండాలని తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌ కార్డు, బ్లడ్‌ గ్రూప్‌ వివరాలు తప్పనిసరిగా తీసుకురావాలని, కోడ్‌ తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు. అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు వెంకట స్వామి, చైర్మన్‌ రాఘవరెడ్డి పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని, వివరాలకు 7013754776, 9701247118 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

పంటలపై ఏనుగుల దాడి


పాళెం సమీపంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం, కమ్మపల్లె పంచాయతీల పరిసర ప్రాంతాల పంట పొలాలపై మంగళవారం రాత్రి ఏనుగులు విరుచుకు పడ్డాయి. బుధవారం ఏనుగులు ధ్వంసం చేసిన పంట పొలాలను అటవీ, పోలీసు సిబ్బంది, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌తో కలసి తహసీల్దార్‌ శేషగిరిరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాళెం, కమ్మపల్లె పంచాయతీల పరిసర ప్రాంతాల్లో ఏనుగుల సంచారం అధికంగా ఉందని, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒంటరిగా అటవీ ప్రాంతం, పొలాల వద్దకు వెళ్లకూడదని తెలిపారు. ఏనుగుల కట్టడికి అటవీశాఖాధికారులతో కలసి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

విహంగం..విహారం!




విదేశీ విహంగాలు సీజన్‌కు ముందే వచ్చేశాయ్‌. నేలపట్టులో అతిథి పక్షులు సందడి చేస్తున్నాయ్‌. రక్షిత కేంద్రంలో కిలకిలరావాలు మార్మోగుతున్నాయ్‌. ముందుగా చేరుకున్న నత్తగుల్ల కొంగలు కనువిందు చేస్తున్నాయ్‌.. త్వరలోనే గూడ బాతులు.. తెల్లకంకణాయిలు.. తెడ్డుముక్కు కొంగలు.. ఫ్లెమింగోలు తరలిరానున్నాయ్‌.. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సందర్శకులు ఇబ్బంది పడకుండా పకడ్బందీగా వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా చిన్నారులను ఆకట్టుకునేలా పార్కులను సన్నద్ధం చేస్తున్నారు.

- నేలపట్టులో నత్తగుల్ల కొంగలు
- సీజన్‌కు ముందే చేరుకున్న అతిథులు
- పక్షుల రక్షిత కేంద్రంలో ఏర్పాట్లు చేపట్టిన అధికారులు
- సందర్శకుల కోసం పక్కాగా వసతులు


కేంద్రంలో విడిది చేస్తున్న నత్తగుల్ల కొంగలు


నేలపట్టు పక్షుల కేంద్రం ప్రధాన గేటు



దొరవారిసత్రం: ఆసియా ఖండంలో విదేశీ వలస విహంగాలకు అతి పెద్ద సంతానోత్పత్తి కేంద్రంగా ప్రసిద్ధిగాంచిన నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం 1976లో ఏర్పాటైంది. ఏటా శీతాకాలంలో క్రమం తప్పకుండా నైజీరియా, బర్మా, ఆఫ్ఘనిస్తాన్‌, ఖజకిస్తాన్‌ తదితర దేశాల నుంచి గూడబాతులు, నత్తగుళ్లకొంగలు, తెడ్డుముక్కుకొంగలు, స్వాతికొంగలు, నారాయణపక్షులు, బాతు జాతికి చెందిన పలు రకాల విహంగాలు ఆకాశ మార్గంలో వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి ఇక్కడకు తరలివస్తుంటాయి. ఇక్కడి చెరువులోని కడప చెట్లపై సుమారు 7 నెలల పాటు విడిది చేసి వాటి సంతానాన్ని అభివృద్ధి చేసుకుని తిరిగి స్వస్థలాలకు వెళ్లిపోతుంటాయి. వీటిని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుంచి కూడా పెద్దసంఖ్యలో సందర్శకులు విచ్చేస్తుంటారు.

వలస పక్షుల సంతానోత్పత్తి ఇలా..

పక్షుల కేంద్రానికి వచ్చే వలస విహంగాల జీవన విధానం దాదాపు మనుషులను పోలి ఉంటుంది. విడివిడిగా ఇక్కడకు చేరుకున్న పక్షులు తొలుత ఆడ, మగ జాతులు ఒకదాన్ని ఒకటి అర్థ చేసుకుంటాయి. మగ పక్షికి ఆడ పక్షి గూడు కట్టుకునే పుల్లను అందించి స్నేహం కుదుర్చుకుంటాయి. అనంతరం చెరువులోని కడప చెట్లుపై ఆడ,మగ పక్షులు గూళ్లు కట్టుకుని జత కడతాయి. ఆడ పక్షి గుడ్లు (2-3) పెట్టిన తర్వాత మగ పక్షి గుడ్ల రక్షణ బాధ్యత తీసుకుంటుంది. గుడ్లు పిగిలాక కూడా మగ పక్షి పిల్లలకు సంరక్షకుడిగా వ్యవహరిస్తుంది. పక్షులు 24 కిలోమీటర్లు దూరంలోని పులికాట్‌ సరస్సులో చేపలను వేటాడి పిల్లలకు ఆహారంగా అందిస్తాయి. ఈ సన్నివేశాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. పక్షి పిల్లలు పెద్దవయ్యాక చెరువులోనే పెద్ద పక్షులు ఈత నేర్పుతాయి. అవి ఎగిరే స్థాయి వచ్చాక అన్నీ ఆయా దేశాలకు వెనుతిరిగి వెళ్లిపోతాయి.

సీజన్‌కు ముందే సందడి

నేలపట్టు పక్షుల కేంద్రంలో విహంగాల కిలకిలరావాలు సీజన్‌కు ముందే మొదలైంది. సాధారణంగా అక్టోబర్‌లో సీజన్‌ మొదలై ఏప్రిల్‌ వరకు కొనసాగుతుంది. ఈ ఏడాది కూడా రెండు వందలకు పైగా నత్తగుల్ల కొంగలు ముందే చేరుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నేరేడు, మారేడు, అత్తిగుంట చెరువుల్లోకి నీరు చేరింది. ఆయా చెరువుల్లో పెరిగిన కడప చెట్లపై నత్తగుల్ల కొంగలు విడిది చేస్తున్నాయి. వీటితో పాటు పదుల సంఖ్యలో చుట్టపక్కల ప్రాంతాల్లోని పసుపురుల కొంగలు, చిన్నస్వాతి కొంగలు, శబరి కొంగలు, నీటి కాకులు దర్శనమిస్తున్నాయి. మరికొన్ని ఆకాశంలో చక్కర్లు కొడుతున్నాయి.

చకచకా ఏర్పాట్లు

పక్షుల రక్షిత కేంద్రంలో వన్యప్రాణి విభాగం, అటవీశాఖ అధికారులు సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తున్నారు. విహంగాల రాక మొదలుకావడంతో పనులను వేగవంతం చేశారు. ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించి రూ.10లక్షలతో చెరువు కట్టపై వ్యూ పాయింట్ల వద్ద షెడ్లు, జింకల పార్కులో తాగునీటి గుంతలు, చెట్ల కింద పర్యాటకుల కోసం సిమెంట్‌ బెంచీలు ఏర్పాటు చేశారు. అలాగే నాలుగు ప్రాంతాల్లో రచ్చబండలు నిర్మించారు. ప్రస్తుతం పిల్లల పార్కులో పరికరాలకు మరమ్మతులు చేయిస్తున్నారు. మరుగుదొడ్ల వసతి, పార్కింగ్‌ స్థలం అభివృద్ధి, తాగునీటి కొళాయిలు ఏర్పాటు, ఇతర మరమ్మతుల్లో నిమగ్నమయ్యారు.


పార్కులో చుక్కల జింకల సందడి


చెరువు కట్టపై వ్యూ పాయింట్లు వద్ద సందర్శకుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన షెడ్లు


పక్షుల కేంద్రంలోని పర్యావరణ కేంద్రం

పర్యాటకుల కోసం..



నేలపట్టు పక్షుల కేంద్రంలో పర్యాటకుల సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేశాం. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా పార్కును సిద్ధం చేస్తున్నాం. సీజన్‌కు ముందే నత్తగుల్ల కొంగలు రావడంతో సందర్శకులు రాక ప్రారంభమైంది. అన్ని పక్షులు వస్తే అక్టోబర్‌ 1వ తేదీ నుంచి టికెట్‌ కౌంటర్‌ ప్రారంభిస్తాం. విదేశీ విహంగాలను వీక్షించి ప్రజలు ఆనందించేలా సర్వం సిద్ధం చేస్తున్నాం. – వి.భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఫారెస్ట్‌ రేంజర్‌, నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం

పేదల వైద్యానికి భరోసా


పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: పేదల వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం కత్తెరపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్‌ నవీనతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్‌ వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది ఖాళీలు లేకుండా మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నాడు–నేడు కింద ఆస్పత్రులను ఆధునీకీకరిస్తున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. వైద్యాధికారులు గోపినాథ్‌, యూసఫ్‌, భువనేశ్వరి, హేమశ్రీ, వైఎస్సార్‌ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, బాలాజీ, వైస్‌ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మండల కన్వీనర్‌ శేఖర్‌రాజు, లోకనాథనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

- ఆర్టీసీ వైస్‌ చైర్మన్‌ విజయానందరెడ్డి
- చిత్తూరులో 5 కే రెడ్‌ రన్‌ మారథాన్‌


జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ వైస్‌ చైర్మన్‌ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్‌: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆరోగ్యంగా ఉన్నవారే నిజమైన ధనవంతులని ఆర్టీసీ వైస్‌ చైర్మన్‌ విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలో బుధవారం ఎయిడ్స్‌ కంట్రోల్‌ విభాగం ఆధ్వర్యంలో 5కె రెడ్‌ రన్‌ మారథాన్‌ నిర్వహించారు. విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ మారథాన్‌ చేపట్టారు. ముఖ్య అతిథిగా విజయానందరెడ్డి పాల్గొని జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీవన విధానం, ఆహార నియమావళి పాటించకపోవడం వల్ల రోగాలు ప్రజలను చుట్టి ముట్టేస్తున్నాయన్నారు. అతిగా తినడం..తగిన వ్యాయామం చేయకపోవడం వల్ల ముఖ్యంగా బీపీ, మధుమేహ వ్యాధులు పుట్టుకొస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధి బారిన పడేవారి సంఖ్య కూడా పెరిగిందన్నారు. ఇలాంటి తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్య భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థి దశ నుంచే రన్నింగ్‌, వ్యాయామం, ధ్యానం అలవాటు చేసుకోవాలని తెలిపారు. వీటి వల్ల శారీరక సౌష్టవం, ఆరోగ్యం సిద్ధిస్తాయని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్‌, ఆంధ్రప్రదేశ్‌ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్‌ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్‌, ఆంధ్రప్రదేశ్‌ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్‌, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

బృందావన్‌ ఇంగ్లీష్‌ మీడియం స్కూల్‌
డోర్‌ నెం.6-566/2ఎ, నాగాలమ్మ గుడి ప్రక్కన
సంతపేట, చిత్తూరు
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్‌ నంబరు : 97037 74402

వేగంగా.. సులభంగా

త్వరలో ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్‌ను అమల్లోకి తెస్తోంది. కంప్యూటర్‌ ఎయిడెడ్‌ అడ్మినిస్ట్రేషన్‌ ఆఫ్‌ రిజిస్ట్రేషన్‌ డిపార్ట్‌మెంట్‌ (కార్డ్‌)ను ఆధునీకరించి ప్రైమ్‌ కార్డ్‌ 2.0కు రూపకల్పన చేసింది. ఈ సాఫ్ట్‌వేర్‌ ద్వారా సమయం వృథా కాదు. రిజిస్ట్రేషన్‌కు డిజిటల్‌ సైన్‌ ద్వారా అప్లయ్‌ చేస్తే.. నేరుగా డాక్యుమెంట్‌ను మెయిల్‌ చేస్తారు. స్టాంపు పేపర్లు, సంతకాలతో పనిలేకుండా సులువుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. బయోమెట్రిక్‌ ద్వారా వేలిముద్ర వేయడానికి 5 నుంచి 10 నిమిషాలు ఉంటే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

- ప్రైమ్‌కార్డ్‌తో అత్యంత వేగంగా రిజిస్ట్రేషన్లు
- డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లోనే తయారీకి అవకాశం
- స్టాంప్‌ డ్యూటీ, ఫీజులు సైతం..
- ఎప్పుడు కావాలంటే అప్పుడు టైమ్‌ శ్లాట్‌ బుకింగ్‌
- త్వరలో అమలులోకి..



రానున్న ప్రైమ్‌ కార్డు 2.0 సాఫ్ట్‌వేర్‌

చిత్తూరు కార్పొరేషన్‌: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను ప్రభుత్వం టెక్నాలజీ వైపునకు నడిపిస్తోంది. రిజిస్ట్రేషన్‌శాఖలో 1999 నాటి ఎయిడెడ్‌ అడ్మినిస్ట్రేషన్‌ ఆఫ్‌ రిజిస్ట్రేషన్‌ శాఖ(కార్డు 1.0) సాఫ్ట్‌వేర్‌ను మరింత ఆధునీకరించి ప్రైమ్‌ కార్డు 2.0గా అప్‌డేట్‌ చేసింది. ఈ సాఫ్ట్‌వేర్‌ ద్వారా స్థిరాస్తుల లావాదేవీల రిజిస్ట్రేషన్‌ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ప్రైమ్‌ కార్డు ద్వారా స్టాంప్‌ పేపర్లు, సంతకాలతో పనిలేకుండా రిజిస్ట్రేషన్లను చేసుకోవచ్చు. డాక్యుమెంట్లను ఎవరికి వారే ఆన్‌లైన్‌లో తయారు చేసుకుని, ఆస్తి వివరాలు,పేరు, ఆధార్‌, సాక్షులు వంటి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే వెంటనే ఆస్తి మార్కెట్‌ విలువ, స్టాంప్‌ డ్యూటీ, రిజిస్ట్రేషన్‌ ఫీజు, యూజర్‌ చార్జీలు ఎంత కట్టాలో చూపిస్తుంది. ఈ సొమ్మును ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు, ఆఫ్‌లైన్‌, స్టాక్‌హోల్డింగ్‌ ద్వారా కూడా చలానా చెల్లించవచ్చు. అనంతరం రిజిస్ట్రేషన్‌కు టైమ్‌ స్లాట్‌ బుక్‌ చేసుకుని రిజిస్ట్రార్‌ కార్యాలయం లేదా గ్రామ, వార్డు సచివాలయానికి వెళితే అక్కడ వెంటనే రిజిస్ట్రేషన్‌ పూర్తి చేసే విధానం అందుబాటులోకి రానుంది. ప్రస్తుత విధానంలో చాలామందికి డ్యాకుమెంట్లపై అవగాహన లేక దస్తావేజు లేఖర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. డాక్యుమెంట్లను తయారు చేయించుకుని సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలో అందజేస్తే అక్కడి సిబ్బంది డేటా ఎంట్రీ, స్కానింగ్‌ చేసి రిజిస్ట్రేషన్‌ చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాల వద్ద ప్రజలు పడిగాపులు పడాల్సి వస్తోంది. వీటికి ప్రైమ్‌ కార్డు 2.0తో చెక్‌పడనుంది. అలాగే వ్యవసాయ భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్‌ అయిన తర్వాత తహశీల్దార్‌ కార్యాలయానికి వ్యక్తిగతంగా మ్యూటేషన్‌ కోసం వెళ్లాల్సిన పనిలేదు. ఆటోమేటిక్‌గా మ్యూటేషన్‌ అవుతుంది. వినియోగదారుల వెసులబాటు కోసం ఆఫ్‌లైన్‌ (పాత విధానం) ద్వారా దస్తావేజు సమర్పించే అవకాశం కూడా కల్పించారు.

త్వరలో అమల్లోకి



రిజిస్ట్రేషన్‌శాఖ సంస్కరణలో భాగంగా నూతన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. తద్వారా వేగంగా రిజిస్ట్రేషన్‌ జరుగుతుంది. ఈవిధానంలో ఇచ్చే రిజిస్ట్రేషన్‌ పేపర్లు జిరాక్స్‌ కాదు డిజిటల్‌ ఒరిజినల్‌ కాపీలు. భవిష్యత్తులో స్టాంప్‌పేపర్స్‌ ఉండవు, వాటి స్థానంలో ఈస్టాంపింగ్‌ ఉంటుంది. వినియోగదారులు దస్తావేజులు తయారుచేసుకుని స్లాట్‌ ద్వారా టైమ్‌ బుక్‌ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌ పేపర్లు నేరుగా మెయిల్‌కు వస్తాయి. వాటిని స్టాంప్‌ పేపర్‌ లేదా ఈస్టాంప్‌ పేపర్‌పై ప్రింట్‌ తీసుకోవచ్చు. వీటికి పూర్తి చట్టభద్రత ఉంది. మీ ఆస్తులకు ఎటువంటి హాని ఉండదు. – శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్‌

జగనన్నకు చెబుదాంపై తక్షణం స్పందించాలి


వినతులను స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు

సోమల: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే అర్జీలకు అధికారులు తక్షణం పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను విని సంబంధిత అధికారులతో పరిష్కారం కాకపోవడానికి కారణాలను తెలుసు కున్నారు. తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించడం ద్వారా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించ వచ్చని తెలిపారు. మొత్తం 102 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌ రెడ్డి, ఆర్డీఓ శివయ్య, హార్టికల్చర్‌ అధికారి మధుసూదన్‌ రెడ్డి, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా పీడీలు తులసి, గంగాభవాని, రాధమ్మ, ఎంపీడీఓ నాగరాజు, ఇన్‌చార్జి తహశీల్దార్‌ మాధవ రాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ గంగాధరం, ఎంపీపీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోయకొండ హుండీ ఆదాయం రూ.65.15లక్షలు


కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.65.15 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈఓ చంద్రమౌళి తెలిపారు. బుధవారం ఆలయంలో 58 రోజులకు సంబంధించి హుండీ కానుకలను లెక్కించారు. రూ.64,66,529 నగదు, బంగారం 35 గ్రాములు, వెండి 594 గ్రాములు లభించాయి. అలాగే రణభేరి గంగమ్మ ఆలయం హుండీ ద్వారా రూ:48,612 లభించినట్లు ఈఓ తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలయ ,బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకునికి ఆవు, దూడ కానుక


ఆవు, దూడను అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి చిత్తూరు పంట్రంపల్లెకు చెందిన శ్రీకాంత్ శర్మ పాడి ఆవు, దూడను కానుకగా అందజేశారు. బుధవారం సాయంత్రం పాడి ఆవు, దూడను ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చి ఆలయం వద్ద ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుకు అందజేశారు.

సామాన్యులకు సంతృప్తికర దర్శనం

- వేకువజాము నుంచే భక్తులకు అనుమతి
- ఆర్జిత సేవలు రద్దు
- జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్
- కాణిపాకం బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్ష


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిషాంత్ రెడ్డి, ఎమ్మెల్యే బాబు, చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ తెలిపారు. ఈనెల 18వ తేదీ చవితి రోజు నుంచి 21 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలపై బుధవారం ఆలయ సమావేశ మందిరంలో దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు అధ్యక్షతన జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఎస్పీ రిషాంత్ రెడ్డి కూడా పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, తీసుకుంటున్న చర్యలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ఎలాంటి పొరబాట్లు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ పరిసరాలు, క్యూలు, వాహన సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మజ్జిగ, తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ తదితరాలపై చర్చించారు. ప్రజాప్రతినిధులు, వీఐపీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం కల్పించాలని సూచించారు. ఎస్పీ రిషాంత్ రెడ్డి మాట్లాడుతూ భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు, వాహనాల పార్కింగ్‌పై కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం జితేంద్రనాథ్‌రెడ్డి, ఆర్డీఓ రేణుక, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, డీపీఓ లక్ష్మీ, ఏఈఓలు పాల్గొన్నారు.

రాత్రి 10 గంటల వరకు దర్శనం

బ్రహ్మోత్సవ రోజుల్లో వేకువ జాము 4 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం ఉంటుందని జిల్లా షణ్మోహన్ తెలిపారు. ఈనెల 18న చవితి రోజు మాత్రం రాత్రి 11 గంటల వరకు నిరంతరంగా దర్శనం ఉంటుందన్నారు. ప్రధాన ఉత్సవాలు జరిగే ఈనెల 25, అక్టోబర్ 5, 7, 8 తేదీల్లో ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనం ఉంటుందని వివరించారు. ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను సమష్టిగా పనిచేసి విజయవంతం చేద్దామని అధికారులకు సూచించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు మాట్లాడుతూ చవితి రోజు నుంచి బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్: అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీవీకేఎన్ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి తెలిపారు. హిందీ, కామర్స్, వృక్షశాస్త్రం, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, జువాలజీ విభాగాల్లో ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. పీజీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పీహెచ్‌డీ, సెట్, నెట్ అర్హతలున్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈనెల 20వ తేదీలోపు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని తెలిపారు. వివరాలకు 8919962288 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.


చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,450
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75.00

ఖోఖో జూనియర్ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన బాలుర జట్టు

చిత్తూరు కలెక్టరేట్ : ఖోఖో జూనియర్ జిల్లా బాల, బాలికల జట్లను బుధవారం ఎంపిక చేశారు. జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 75 మంది బాలురు, 48 మంది బాలికలు పాల్గొన్నారు. జిల్లా చీఫ్ కోచ్ బాలాజీ ఆధ్వర్యంలో జట్లను ఎంపిక చేశారు. సంఘం కార్యదర్శి శరత్‌బాబు మాట్లాడుతూ అక్టోబర్‌లో యాదమరి మండలంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని తెలిపారు. బాలురు 20 మంది, బాలికలు 20 మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. పీడీలు రాజేష్, సురేష్, ముత్తు, శారద, సరిత పాల్గొన్నారు.

పొలంలో మొక్కల నరికివేత



శ్రీరంగరాజపురం : తన పొలంలోని మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేసినట్లు మండలంలోని పాతపాళ్యం గ్రామానికి రైతు చిరంజీవి బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ లెక్క దాఖలు సర్వే నెంబర్ 102లో తనకు ఎకరా పొలం ఉందని, ఇందులో కొబ్బరి, మామిడి, సపోటా, టేకు, వేప మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. గతంలో తనకు తన గ్రామానికే చెందిన వెంకటేష్‌కు మధ్య మనస్పర్థలు ఉన్నాయని, అతనే ఈ పని చేసి ఉంటాడని ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్షావలి తెలిపారు.

పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష

- రేపటి నుంచి వలంటీర్లు ఇంటింటా సర్వే ప్రారంభించాలి
- క్యాంపులు నిర్వహించే స్థలం, సమయం టోకెన్‌లు అందజేయాలి
- సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్ వెల్లడి


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవో, మెడికల్ ఆఫీసర్‌లు, మునిసిపల్ కమిషనర్, డిజిటల్ అసిస్టెంట్‌లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో 15వ తేదీన వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని చెప్పారు. ప్రధానంగా 30 సంవత్సరాల పైబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలల్లో ఉండే పిల్లల ఆరోగ్య పరిస్థితి వివరాలు సేకరించాలని చెప్పారు. సమాచారం సేకరించడం తో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేయించాలన్నారు. ఈ నెల 16 వ తేదీ నుంచి మెడికల్ అధికారులు, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి వ్యాధుల వివరాలను తప్పనిసరిగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఏఎన్‌ఎం లకు సహాయకులుగా వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. క్యాంపు నిర్వహించే స్థలం, తేదీ సమయం తప్పనిసరిగా తెలియజేసి టోకెన్‌లను ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతిదేవి, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఈవో విజయేంద్రరావు, మెప్మా పీడీ రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్రగాయాలు


తిరుపతిలో చికిత్స పొందుతున్న తులసీరామ్

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని శిరుగురాజు పాళెం గ్రామంలో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఎల్‌ఈడీ లైట్ల మరమ్మతుల కోసం స్తంభం ఎక్కిన తులసీరామ్(20) షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఎల్‌సీ తీసుకున్నా స్తంభంపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తలకు తగలడంతో ప్రమాదం జరిగినట్లు ఏఈఈ రవిచంద్రన్ తెలిపారు. క్షతగాత్రుడిని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం సర్పంచ్ మురళీయాదవ్ తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. గాయపడ్డ యువకుడు నారాయణవనం మండలం కల్యాణపురం ఒడ్డిల్లుకుచెందిన వాడని తెలిపారు.

విద్యార్థి అదృశ్యం


ముబారక్(ఫైల్)

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లెకు చెందిన జుబేదా కుమారుడు ముబారక్ (16) అదృశ్యమయ్యాడు. తనకు సెల్ ఫోన్ కొనివ్వలేదని గతనెల 21న అలిగి ఇంటినుంచి వెళ్లి పోయాడు. అప్పటి నుంచి పలుచోట్ల గాలించినా కనిపించకపోవడంతో బుధవారం రాత్రి కల్లూరు పోలీస్టేషన్‌లో తల్లి జుబేదా ఫిర్యాదు చేసింది. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవిప్రకాష్ తెలిపారు.

21 నుంచి డిగ్రీ పరీక్షలు

తిరుపతి సిటీ : శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో డిగ్రీ కోర్సులకు సంబంధించి ఐదు, ఆరవ సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలను ఈ నెల 21వ తేదీ నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి దామ్లా నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పరీక్షల ఫీజు చెల్లించిన విద్యార్థులకు పరీక్షల షెడ్యూలు విడదల చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఎస్వీయూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలలకు సర్క్యులర్ పంపించామని వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లి బీటీ కళాశాల, చిత్తూరు పీవీకేఎన్ కళాశాల, తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల సెంటర్లలో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. అలాగే ఈ నెల 11వ తేదీన జరగవలసిన పీజీ నాలుగో సెమిస్టర్, ఎంఈడీ పరీక్షలను ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు గమనించాలని పరీక్షల నియంత్రణాధికారి దామ్లా నాయక్ కోరారు.

ఎట్టకేలకు తల్లిఒడికి పసికందు


తల్లి అమరావతికి బిడ్డను అప్పగిస్తున్న సీఐ, ఐసీడీఎస్ సిబ్బంది

పలమనేరు: కనిపడేసి చేతులు దులుపుకుందామనుకున్న ఆ కసాయి తల్లి మనసు కనికరించింది. తన బిడ్డ తనకే కావాలంటూ అధికారులను ప్రాధేయపడి అనాథలా మారకుండా ఆ పసిగుడ్డును తన ఒడిలోకి చేర్చుకుంది. ఓ మహిళ పదిరోజుల కిందట పలమనేరులోని కేవీఎస్ స్ట్రీట్‌లో ఆడబిడ్డను కని డ్రైనేజీలో పడేయడంతో స్థానికులు ఆస్పత్రిలో చేర్చిన విషయం తెలిసిందే. వివరాలిలా ఉన్నాయి.. గతనెల రెండున కర్ణాటక రాష్ట్రం ముళబాగిలు ఆవాస గ్రామంలోని వివాహిత అమరావతి(40) పట్టణానికి చెందిన ఓ 50 ఏళ్ల పైబడిన వ్యక్తితో సహజీవనం చేస్తూ గర్భం దాల్చింది. వీరిద్దరూ పట్టణంలో ఓ చోట రహస్యంగా నివాసం ఉండేవారు. గర్భందాల్చిన అమరావతి స్థానిక ఏరియా ఆస్పత్రి సమీపంలోని కేవీఎస్ స్ట్రీట్‌లో ఈనెల మూడో తేదీ ఆడబిడ్డను కని డ్రైన్‌లో పడేసింది. ఆపై తీవ్రంగా రక్తస్రావం కావడంతో ఆస్పత్రిలో చేరింది. కేవీఎస్ వీధిలో వాకింగ్ వెళ్లే వారు డ్రైన్‌లో పసికందును గుర్తించి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఎస్‌బీయూ(న్యూబోర్న్ బేబీ యూనిట్)లో పెట్టి చికిత్సలందించి ఆపై మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పూర్తి ఆరోగ్యంతో డిస్చార్జ అయిన పసికందును బుధవారం తిరుపతిలోని శిశువిహార్‌కు తరలించేందుకు ఐసీడీఎస్ అధికారులు సన్నాహాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న తల్లి బిడ్డ తనకే కావాలంటూ అధికారులను ప్రాధేయపడింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రశేఖర్ ముందు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నజ్మా, అంగన్‌వాడీ వర్కర్, ఆశా కలిసి పాపను తల్లికి అప్పగించారు.

పుంగనూరులో పగలే చోరీ


అనుమానితుడి సీసీ పుటేజ్ ఫొటో

పుంగనూరు: పట్టణంలోని గాంధీనగర్‌లో పగలే బంగారు, వెండి నగలు చోరీ అయిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న అహమ్మదాలి ఇంటిలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో మహిళలు లోపల బట్టలు ఉతుక్కుంటున్నారు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న 29 గ్రాముల బంగారు నగలు, 175 వెండి ఆభరణాలు, కొంత నగదు, చీరలు చోరీ చేశారు. కొంత సేపటి తర్వాత ఇంట్లోని వారు చోరీ జరిగినట్లు గుర్తించారు. పోలీసులకు బాధితుడు ఈమేరకు ఫిర్యాదు చేశాడు. సీఐ రాఘవరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి చిత్తూరు నుంచి క్లూస్ టీమ్‌ను పిలిపించి, వేలిముద్రలు సేకరించారు. పగలే చోరీ కావడంపై పోలీసులు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆప్రాంతాల్లో సీసీ పుటేజ్‌లను పరిశీలించగా అనుమానితుడు చీరలు, నగలు మూటకట్టుకుని వెళ్తున్నట్లు గుర్తించారు.

18న శ్రీనివాససేతు ప్రారంభోత్సవం


అధికారులతో సమీక్షిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా : తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్‌ను ఈ నెల 18వ తేదీన అట్టహాసంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని స్మార్ట్ సిటీ ఎండీ హరిత ఆదేశించారు. బుధవారం ఈ మేరకు ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. హరిత మాట్లాడుతూ టీటీడీ, తిరుపతి స్మార్ట్ సిటీ సంయుక్త భాగస్వామ్యంతో రూ.650 కోట్లు వెచ్చించి ఫ్లైఓవర్ నిర్మించినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతులమీదుగా తిరుచానూరు మార్కెట్ వద్ద ప్రారంభోత్సవం చేయనున్నట్లు వివరించారుద్దా ప్రాంతంలో ప్రత్యేక గ్యాలరీలు సిద్ధం చేయాలని, అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. తాతయ్యగుంట గంగమ్మ దర్శనానికి ముఖ్యమంత్రి వస్తున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ శ్రీనివాసులు, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం, రెవెన్యూ అధికారులు కేఎల్ వర్మ, సేతు మాధవ్, డీఈలు, ఫైర్ అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం.. సర్వం సిద్ధం







తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 18వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. ఆలయ గోపురం.. తిరువీధులను శోభాయమానంగా తీర్చిదిద్దింది. శ్రీవారి పుష్కరిణిని విద్యుద్దీపాలతో అలంకరించింది. భక్తులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించింది. – తిరుమల